# చర్విత చరణం

ఇంట్లోకి వస్తూనే పరిశీలనగా చూసేడు విశ్వం. వాతావరణంలో మార్పేమీ కనపడలేదు. ఇల్లంతా నిర్జీవంగా, నిశ్చైతన్యంగావుంది. తనలోతనే విసుక్కుంటూ, తనగదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని పెరట్లోకి వెళ్ళాడు. పెరటి వేపు వరండాలో, విశ్వంతండ్రి 'గోపాలం' పట్టెమంచంమీద పడుకునివున్నాడు. తల్లి లక్ష్మీదేవి మంచానికానుకుని క్రింద కూర్చుంది. విశ్వం నూతిదగ్గరకు వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని తండ్రివద్దకు వచ్చేడు. గోపాలం మంచమీద లేచి 'తలగడ' గోడకి జారేసి దాన్ని ఆనుకుని కూర్చున్నాడు. 'విశ్వం' మంచంమీద కూర్చున్నాడు.

పెరటినిండా సపోటా, జామ, మామిడి, పనస, బాదం మొదలయిన చెట్లు ఉన్నాయి. అంచేత మిట్టమధ్యాహ్నమప్పుడు కూడా పెరటంతా, పచ్చనిపందిరివేసినట్లు చల్లగా వుంటుంది.

మేడమీద రెండుగదులు 'ఎయిర్ కండిషన్' చేయబడినప్పటికీ 'గోపాలం' ఎప్పుడూ ఆ పెరటి 'వరండా' నాశ్రయించుకునే వుంటాడు. అతనికి డెబ్బైఏళ్ళుదాటాయి. పచ్చని శరీరం, బక్కపలచగా రెక్కగూళ్ళవద్ద కొద్దిగా గూనితో ఉంటాడు.

'లక్ష్మీదేవి' కూడా పచ్చనిపసిమిరంగులో ఉంటుంది. అరవయిఏళ్ళు నిండుతున్నాయి. కోలముఖం, ముడుతలుపడ్డ

నుదురుమీద, నయా పైసంత కుంకుమబొట్టు, చెవులని బరువుగా జారిపోతున్న 'పదివేల' విలువయిన రవ్వల కమ్మలు. సన్నగా నల్లగా తళతళలాడే చూపులు, ఎవరికైనా ఆ వృద్ధ పుణ్యస్త్రీని చూడగానే చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది.

'గోపాలం' వయోవృద్ధుడైనా లేవలేని పరిస్థితిలో లేడు. ఉదయాన్నే లేచి పళ్ళుతోముకుంటూనే గొడుగూ, చేతికర్రా తీసుకుని పొలాల గట్లమ్మట నడిచివస్తాడు. ఇంచుమించు రెండుమైళ్ళయినా రోజుకి ఆయన నడవకుండా వుండడు. ఇంటికిరాగానే 'యాభై తులాల' వెండిగ్లాసుతో, శేరు చిక్కనిపాలు వేడివేడిగా త్రాగుతాడు. అరగంట అయినాక స్నానంచేసి బట్టలు మార్చుకుని 'వరండా'లోని మంచమీదకు జేరతాడు. కాస్సేపు ఆ రోజు పేపరు చూస్తాడు. రోజులో ఎక్కువభాగం 'వరండా'లో మంచం మీదే గడుపుతాడు. గోపాలానికి 'విశ్వం' ఒక్కడే కొడుకు, అయిదుగురు కూతుళ్లున్నారు. పాతిక ముప్పయ్ సంవత్సరాల క్రితం ఆడవాళ్ళకి ఆస్తి హక్కులు వుండేవికావు. అందువల్లే గోపాలం అయిదుగురమ్మాయిల పెళ్ళిచేసినా అతని నూటయాభయ్ ఎకరాల పల్లపుభూమికి ఏమీ ఢోకా రాలేదు. రెండు మేడలున్నాయ్. మూడు తరాలనుంచీ గోపాలం పూర్వీకుల్లో ఒక్కొక్కడే వారసుడవటం మంచి ఆస్తిలో చీలికలులేక, 'జమీందారుల్లా' వుండేవారు.

గోపాలానికి విశ్వం ఒక్కడే కొడుకు, విశ్వానికి ఆడపిల్లలుకూడా లేకుండా ఒక్కడే కొడుకున్నాడు. పేరు

'నారాయణ' బి. యి. ప్యాసయి ఢిల్లీలో ఇంజనీర్ గా వుంటున్నాడు. ఇరవయిఆరేళ్ళు వుంటాయి.

'విశ్వం' అక్కడికి దగ్గరగావున్న పట్నంలో 'బిజినెస్' చేస్తున్నాడు. మెరక నీరుపల్లానికే, పల్లపునీరూ పల్లానికే అనే సామెతలాగే విశ్వం 'బిజినెస్'లో బోలెడు లాభాలు వస్తోన్నాయి. వెనకా, ముందూ, ఆర్థికలోపం అనేదే ఎరగకుండా, వాళ్ళ జీవితాలు గడుస్తున్నాయి.

ఇలా వుండగా నారాయణ పెళ్ళి విషయం వచ్చింది. దానితో ఇంట్లో ప్రతిష్టంభన ఏర్పడింది. విశ్వం భార్య కుసుమకు చిన్నప్పట్నించీ తన అన్నకూతురు 'నీలా'ను కోడలిగా చేసుకోవాలని కోరికగా వుంది. అడపాతడపా 'విశ్వం' అక్కలు వచ్చి తమ కూతుళ్ళని 'నారాయణ'కిచ్చి పెళ్ళి చేయాలని ఉబలాటపడేవారు. కుసుమ తను 'నీల'ను తప్ప ఇంకెవర్నీ కోడలిగా చేసుకోనని ఖచ్చితంగా చెప్పేసేది. దానితో వాళ్లు మూతులు ముడుచుకుని రాకపోకల తగ్గించేశారు. ఇంక నారాయణ ఉద్యోగస్థుడైనాడుకదా అన్నతో సంప్రదించి పెళ్ళి ముహూర్తం పెట్టుదామనేసరికి నారాయణ వేరేశాఖ పిల్లను ప్రేమించాననటం, ఆ పిల్లని తప్ప పెళ్ళిచేసుకోనని ఖచ్చితంగా చెప్పేయటం జరిగింది. దానితో 'కుసుమ' నిద్రాహారాలు మాని కృంగిపోసాగింది.

విశ్వం, లక్ష్మీదేవమ్మ నారాయణ తరపున వాదించేవారు. గోపాలం మటుకు 'కోడలి' కోరికే నెరవేరాలని గట్టి పట్టు పట్టేడు. కుసుమ మటుకు తన గదిదాటి బయటకు రాకుండా కృంగి కుమిలిపోతోంది.

"ఏమిటి అమ్మా, నీ కోడలు ఎలావుంది?" అన్నాడు విశ్వం. విశ్వం బిజినెస్ టూర్ వెళ్ళి ఈసారి పదిహేను రోజులయ్యింది.

"అలాగే వున్నది. తినీ తినకానూ" మూలిగింది లక్ష్మీదేవి.

"హుఁ! ఎంత మూర్ఖత్వమో చూడు" అన్నాడు విశ్వం బాధగా.

"ఆడవాళ్ళం అంతేలేమరి!" అంది లక్ష్మీదేవి. ఆమెలో అంతర్గతంగా ఒక ఆవేదన వుంది. దాన్ని బలవంతంగా హృదయంలో అదిమిపట్టి మూడోతరంలోని నవనాగరీకాన్ని తాను ధృఢంగా బలపర్చగలనని నిరూపించటానికి తాపత్రయపడుతోంది. గోపాలం ముందుకు వంగాడు.

"సరే! విశ్వం! దానిపాటున దాన్ని అలా వదిలేయటం మంచిది కాదురా! ఇంటి ఇల్లాలు కంట తడిపెట్ట కూడదు. అది ఏ పనికీ జయకరం కాదు. ఆ ఇల్లు సర్వనాశనమయిపోతుంది. నారాయణ కుర్రాడు. వాడికేమి తెలుసు? కాస్త ఎర్రగా బురబురలాడుతూ వాలుజడతో ఓరచూపులతో దోరనవ్వు నవ్వితే దాని వెనకాతలపడ్డాడు. ఆ మాత్రం తెల్లటోళ్ళు కావాలంటే ఉత్తరాదిన రూపాయికి పదిమంది దొరుకుతారు. పెళ్ళిచేసుకుని ఆ పిల్లనే ఇల్లాలు అంటూ నెత్తికెక్కించుకోవాల్సినంత అవసరమేం రాలేదు. నవమాసాలు మోసి తన ప్రాణాన్ని పణంగా పెట్టి కని

పెంచిన తల్లిని ఇంత క్షోభ పెట్టి తాను ఆ పిల్లతో ఊరేగా లనుకోవటం ఎంత స్వార్థం ! పిల్లలు లేరు లేరు అంటూ తపించిపోయి చెట్టుకీ పుట్టకీ మ్రొక్కి మ్రొక్కి ఉపవాసాలు చేసిచేసి కన్నది. కుసుమ వాడి బోసినవ్వులు చూసి మురిసి పోయింది తప్పటడుగులు చూసి పరవశించింది. కంటిలో కనుపాపలా ఇరువయినాలుగేళ్ళుగా అనుక్షణమూ కాపా డింది ? అలాంటి మాతృమూర్తికి గుండెలో గునపాలు గుచ్చి, కంటికి నదురయిన కన్నెపిల్లతో చెట్టాలేసుకుని 'అకా శం'లో హంసల్లా ఎగిరిపోవటం ఎంత తప్పు ? ఎంత రాక్ష సత్వం ? ఎంత అమానుషత్వం ?" అన్నాడు గోపాలం. మామగారి మాటలు తారాస్థాయిలో వినబడి కుసుమ కూడా వరండామీాదికి వచ్చింది. వచ్చి మామగారి వెన కాతల పావురంలా ముడుచుకుని నించుంది. 'లక్ష్మీదేవి' కోడలివేపు 'చురకత్తిలా' ఒకచూపు విసిరి,

"బాగుంది ! వయసులోవున్న పిల్లవాడు, వాడికి ఏ పిల్లనచ్చితే దాన్నే కట్టుకుంటాడు, ఇష్టంలేని పిల్లని బలవం తాన్న చేయకూడదు. సంసారంచేసేది వాళ్ళా? మనమా?" అన్నది లక్ష్మీదేవి. 'కుసుమకి' కళ్ళమ్మట నీళ్ళు పొర్లు కొచ్చాయి. "ఇంత పెద్దవారు ! లోకానుభవం వున్నవారు, మీారు కుర్రవెధవకి చెప్పాల్సిందిపోయి మీారుకూడా ఇట్లా తేలిగ్గా తీసిపారేస్తారా ? 'నీల'ను నా కోడలుగా మనింట్లో పెంచాను. నగలిచ్చాను. చీరలిచ్చాను. బంధువులందరితో 'నీల' కుసుమ కోడలిగానే పెరిగింది. చలామణీ అయ్యింది. మన అబ్బాయి సంగతి వదిలేసినా మరి ఇప్పుడు నీలసంగతి

ఏమిటి ? మేనరికం ఎందుకు పాసిగిపోయిందని ప్రతివాళ్ళూ అడగరా ? మేనత్త ఎందుకు చేసుకోలేదో అన్న సందేహాంతో ఇంక ఏ పెళ్ళికొడుకూ దానిని పెళ్ళాడటానికి ముందుకు రాడు. ఒక కన్నెపిల్ల జీవితం దుఃఖభాజకంచేసి 'వాడు' మటుకు జీవితంలో ఎలా సుఖపడగలడు ?" అంది ఉక్రోషంగా.

"ఎందుకు తల్లీ హైరానా పడతావు ? సరే విశ్వం ! 'నారాయణ' నువ్వు గట్టిగా చెప్తే కాదనడురా ! ఈసారి సెలవలకు వచ్చినప్పుడు మళ్ళీ ఒకసారి నువ్వూ, అమ్మ చెప్పిచూడండి. మీా ఇద్దరిమాటా కాదనడు. నా మాట విను కుసుమా ! నీవిలా అభోజనాలు వుండటం మంచిది కాదు తల్లీ ! కాస్త ఎంగిలిపడు ! నువ్వుకూడా భోజనం చేసిరారా !" అన్నాడు గోపాలం. విశ్వం కుసుమకేసి చిరాగ్గా చూసేడు.

"నువ్విలా ఉపోషాలు చేసి, రభస చేసి ఏమిా సాధించలేవు ? ఒక్కగానొక్క పిల్లవాడు. వాడి పెళ్ళి ఎంతో ఘనంగా చేయాలనుకుంటున్నాం. వాడి సుఖ సంతోషాలు తల్లిగా నీవు ఆనందించాలి. కాని ఇలా మూతిముడుచుకు కూర్చోవటం ఏంబాగుంటుంది ! వాడి సౌఖ్యంకన్నా మనం కోరుకోవలసింది ఏముంది?" అన్నాడు విశ్వం.

"మీాకు ఆడదాని మనస్సు ఏం అర్థం అవుతుందీ ! చిన్నప్పట్నించీ నీల-బావమిాద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ ఆశల మొలకలకి, పాదుచేసి నీళ్ళుపోసి పెంచాను. తోటి కన్నెపిల్ల కలలని సమూలంగా కాలరాసి, తాను ఇల్లాలుగా

వెలగాలన్నా, ఆ పిల్లమటుకు ఎంతవరకూ తన జీవితాన్ని సాఫల్యం చేసుకొంటుందో ? ఒక కన్నెపిల్ల కన్నీళ్ళు ఊరికేపోవు !" అంది కుసుమ.

"నీ కన్నెపిల్ల కన్నీళ్ళు వూరికే పోతాయో పోవో తెలీదుగాని నీవుమటుకు కన్నకొడుకన్న అభిమానం లేకుండా ఊరికే శాపనార్ధాలు పెట్టేస్తున్నావు ! పద పద? భోజనంచేద్దాం !" అంటూ కుసుమని భుజం వుచ్చుకుని లోపలికి తీసుకువెళ్ళాడు విశ్వం.

కొడుకూ కోడలూ లోపలికి వెళ్ళినాక తీరిగ్గా కాళ్లు జాచుకొని వాసలైన్ సీసా తీసుకుని అరికాళ్ళకు పాము కుంటూ,

"పాపం ! ముసలాయనకు కోడలిమీద ప్రేమ పొంగి పొర్లిపోతోంది" అంది సాగదీసి లక్ష్మీదేవి.

"నాకెప్పుడూ కోడలిమీద అభిమానం ఒక్కలాగే వున్నది. నారాయణ ఇంత ఇదిగా మారిపోతాడని నేననుకో లేదు. నీలా, తనూ కుర్రతనంనించీ కలిసిమెలిసి పెరిగారు. ఆవిడ మనస్సు ఎంత బాధపడుతుంది అనైనా ఆలోచించ వద్దా. ఈ రోజుల్లో ప్రతి పిల్లగాడికూ ఈ ప్రేమజబ్బు పట్టుకుంది" అన్నాడు గోపాలం. "ఈ రోజుల్లో కొత్తగా ఏం ఈ జబ్బు ముదరలేదు. ప్రతి యువతరంలోనూ ఈ ప్రేమ జబ్బు ఆవిర్భావితం అవుతూనే వుంది. ఆ జబ్బు ముదరనీ కుండా తగిన వైద్యం చేయగల్గితే అదే తగ్గిపోతుంది. సంసా రంలో పడినాక ఒకరిద్దరు బయలుదేరారంటే, ఈ ప్రేమంతా

దోమలు తోలుకుంటూ కూర్చోవలసిందే" వెటకారంగా అన్నది లక్ష్మీదేవి.

"ఏం పోతోంది! జిడ్డులా ఒకింతట మరలకుండా వుంటేనూ! నా వడిలో కూర్చుని పెరిగాడు నారాయణ. ఇంకా చిన్న చెడ్డీవేసుకుని నా దగ్గర కథలూ, కబుర్లూ చెప్పించుకుంటూన్నట్లే వున్నది. ఇవ్వాళ పెద్ద ఇంజనీర్ అయిపోయి, వ్యక్తిత్వం గట్రా అంటూ పెద్ద కబుర్లు చెప్తున్నాడు. పాపం కన్నతల్లి కుసుమకి బాధగా ఉంటుందంటే ఉండదా! ఆ పిల్ల ఎన్నెన్ని ఆశలు పీడిమీద పెంచుకున్నదో, మేనకోడల్ని కోడలిగా ఇంట్లో తెచ్చుకోవాలని ఏ ఆడమనసు ఆశించదు?" అన్నాడు గోపాలం.

"పాపం! ఈనాడు మీ కోడలి ధర్మమా అంటూ ఆడమనసుల అవస్థలు తెలిసివొచ్చాయి. ముప్ఫయ్ఏళ్ళ క్రితం మీ భార్యగా, నా కన్నీళ్ళ విలువ మీకు తెలియలేదు. ఈరోజు కోడలి మొసలి కన్నీళ్లకు విలువనిస్తున్నారు. ఆరోజు నేను అసూయాద్వేషాలతో నిండిన ఆడదాన్నిగా కనిపించేను. ఈరోజు ఆశాపాశంతో ఆవేదన పాలయిన ఆడదానిగా మీ కోడలు కనిపించుతున్నది. ఒకే పరిస్థితిలో వున్న ఇద్దరిస్త్రీలనూ మీరు సమదృష్టితో పరిశీలించలేకపోయారు. అదే మీ మగవాళ్ల మానసిక దౌర్బల్యం! అయిదుగురు ఆడపిల్లల తర్వాత వరప్రసాదంగా పుట్టిన విశ్వం, నా ఆశలకు, అభిమానాలకు, ఆలంబన అవుతాడని, ఆశించటం నాది దురాశా? నేనూ మా అన్న కూతుర్ని 'విశ్వం'కిచ్చి చేద్దామని ముచ్చటపడితే ఆరోజు మీరే

మన్నారు ? కాపరం చేసేది నీవా, వాడా ? వాడి మనసుకు నచ్చిన పిల్లనే చేయాలి అని ధర్మపన్నాలు చెప్పలేదా ? నారాయణని కుసుమ పెంచినట్లు నేను విశ్వాన్ని కనలేదా! పెంచలేదా ? పాతిక ముప్ఫయ్ వేలు కట్నంతో వచ్చిన ఈ జమీందారీ కోడలు 'కుసుమ' ఒక్కనాడన్నా నన్ను 'అత్తా' అని పిలిచిందా ! కాలునొచ్చినా చేయినొచ్చినా డబ్బుఇచ్చిన నౌకర్లచేత సేవలు చేయించుకోవటమే కాని, ముచ్చటగా ఒక్కగానొక్క కోడలు కప్పు కాఫీ అన్నా కలిపి ఇచ్చిందా! ఎందుకు కుండెడు రక్తం ధారపోసి పిల్లల్ని కనటం ! వాళ్లవలన మనకు 'శాంతీ' 'కాంతీ' లభిస్తాయనే కదా ! కానీ కానీ చొప్పున కూడబెట్టి మన స్వసుఖాలను విడనాడి మేడలు మిద్దెలుకట్టి పిల్లల్ని మనంవున్న పరిస్థితి కన్నా ఎక్కువ స్థితిలో వుంచాలని తాపత్రయ పడుతాం ! వాళ్ళు సుఖపడుతోంటే అదొక తృప్తి, అదొక ప్రశాంతి ! అదొక నిత్యనూతనమైన జీవనప్రవాహం ! తమ ప్రతిబింబాలు సుఖసౌభాగ్యాలతో భోగభాగ్యాలతో తులతూగాలని తాము హాయిగా వాళ్లనీడలో సేదతీరాలని వృద్ధజీవులు ఆశించటం, మనసమిష్టి కుటుంబాలలో క్షమించరాని తప్పేం కాదుగా !

"మీరు ఆనాడు విశ్వాన్ని డబ్బుకోసం ఈ కుసుమకి అమ్మేశారు. నా చేతికందే ఆశాఫలాన్ని మీరే చేతులారా దూరం చేశారు. ఆనాడు నా మేనకోడలి స్థానంలో తను డబ్బు ముడుపు పెట్టి కులుకుతూ వచ్చి కూర్చోలేదా ! అలానే ఈనాడు తన మేనకోడలి స్థానంలో ఇంకోఅమ్మాయి

వచ్చి కూర్చుంటుంది. చర్వితచర్వణం అవుతోంది. దీనిలో పెద్ద మీరంతా తలలు పట్టుకూర్చోవలసినంత విశేషం ఏమీ లేదు" తీవ్రంగా అన్నది లక్ష్మీదేవి. భార్య ఉక్రోషం చూసి గోపాలం బోసిగా నవ్వాడు. తనబోడితలని ఒకసారి తడుముకున్నాడు. కొంచెం ముందుకు జరిగి భార్య చేతిమీద చేయివేశాడు.

"ఇదిగో లోపలికి పోయి కాసిని వేడిపాలు తీసుకురా!" అన్నాడు. లక్ష్మీదేవి లోపలకు వెళ్ళింది. ఆవిడ నడుస్తుంటే అందెలూ, కడియాలూ ఒకదానికొకటి తాకుతూ ఇంచ్ ఇంచ్ మంటూ శ్రావ్యమైన ధ్వని వినవస్తోంది. పసుపు రాసినట్లుండే పచ్చని పల్చనిపాదాలు! మట్టెలూ, టింకు టింకు మంటూ మంగళసూత్రాలూ, ఈ శబ్దాలన్నీ పాతిక ముప్పై ఏళ్ళుగా సన్ననిసంగీతం వింటూన్నట్లు అలవాటు అయి పోయింది, గోపాలానికి! అరవై ఏళ్ళుదాటిన ఈ వయస్సులోనూ వందతులాలవెండిని కాళ్ళ మోస్తూనే వున్నదిఆవిడ! ఇన్నాళ్ళుగా, లావణ్య రేఖలాంటి లక్ష్మీదేవి ముఖంచూస్తూ తన మనస్సులోని మలినపుపొరని ఛేదించలేక గిజగిజలాడే వాడు! ఇంక ఇప్పుడు ఆ మాలిన్యాన్ని లక్ష్మీదేవి ముందర కడిగేసుకుంటే, తను కుటుంబకథ చర్వితచరణం కాకుండా, బాంధవ్యపు తీయని అనుబంధముతో కొత్తచిగుళ్ళు వేయటానికి కొంచెమయినా అవకాశం కలిగించినట్లు అవుతుందనే స్థిరనిశ్చయమునకు వొచ్చేడు, గోపాలం! ఘల్లుఘల్లుమంటూ లక్ష్మీదేవి పాతికతులాల వెండిగ్లాసుతో వేడివేడి పాలు తెచ్చి ఇచ్చింది. రెండు గుక్కల్లో త్రాగి భుజంమీదున్న

తువ్వాలుతో ముఖం తుడుచుకున్నాడు. లక్ష్మీదేవి మంచాని కానుకుని క్రింద చతికిల పడింది.

"అబ్బాయి కోడలు భోజనాలుచేసేరా అన్నాడు"

"ఏమో నేను చూడలేదు"

"మల్లమ్మ ఏం చేస్తోందీ?"

"ఏం చేస్తోందీ! వంటింటి వసారాలో కూర్చుని కునికి పాట్లు పడుతోంది" అన్నది విసుగ్గా.

"లక్ష్మీ!" అన్నాడు గోపాలం. మార్థకత ధ్వనించింది అతనిగొంతులో.

"నీకు నామీద పీకదాకా కోపంగా వున్నదికదూ!"

"కోపం ఎందుకు? జరగవలసింది జరిగిపోయేక. ఇంక ఒకళ్ళని ఒకళ్ళం బరుక్కుంటే మటుకు కాలం వెనక్కు నడుస్తుందా?"

"లక్ష్మీ! విశ్వం విషయంలో నేను స్వతంత్రించి చాలా తప్పేచేశాను. నన్ను క్షమించు! ఆ కారణంగా ఇప్పుడు మన కుసుమని తనకన్నవారికి దూరంచేయకు! మన జీవితాలు ప్రొద్దుక్రుంకిపోయాయి! విశ్వం వంటరివాడు, తమ కూతుళ్ళని చేసుకోలేదనే కోపంతో అక్కా చెల్లెళ్ళూ దూరం అయ్యేరు. నీల కారణంగా కుసుమ కన్నవారి ఆత్మీయతని కూడా కోల్పోతుంది. మన కుటుంబాలలో వైవాహిక బంధనాలు వుంటేకాని పరస్పర ఆత్మీయత పెంపు కాదు! నీకు తెలీదా మనవాళ్ళ సంగతి!" అన్నాడు.

"భలేవారే! నేను విశ్వాన్ని కుసుమని సాదిద్దామని నారాయణకి వంతపాడుతున్నాననుకున్నారా? మీరు

ఆనాడు చెప్పినట్లు పసివాళ్ళ ప్రేమానురాగాలని అర్థం చేసు కుందుకు ప్రయత్నించుతున్నాను. అందుకనే పిల్లవాడి ఆశకి అడ్డురావద్దు అంటున్నాను" అన్నది లక్ష్మీదేవి.

"ఇంకా ఎందుకు దెప్పుతావులక్ష్మీ! నా తప్పు నీ ముందు ఒప్పుకుంటున్నాను. పడమటకు వాలిన బ్రతుకులు మనవి! మన పొరపాట్లుమూలంగా పిల్లల బ్రతుకులు అప వాదులపాలు కాకూడదు" అన్నాడు.

లక్ష్మీదేవి భర్తవేపు విస్మయంగా చూసింది. ఇంచు మించు విశ్వం పెళ్ళి కుసుమతో అయిన దగ్గరినించీ భార్యా భర్తల మధ్య అభిప్రాయభేదాలు 'సెల' వేస్తూనే వున్నాయి. అయినా డబ్బు నాగరికతల మధ్య మసులుతున్న వారవటం నించి ఒకరిపట్ల ఒకరికి ప్రబలిన అసహనభావాన్ని పైకి రానీయకుండా గుట్టుగా గడుపు కొచ్చేరు. కుసుమమీద చిర్రుబుర్రులాడుతూ లక్ష్మీదేవి గజ్జెకట్టినా కోడలిమీద ముసలాయన ఆప్యాయత కనబరచినా అట్టే రభాసా జరగ కుండానే రోజులు నిశ్చింతగా దొర్లిపోయాయి. ఇన్నేళ్ళు గడిచాక గోపాలం గొంతులో ఆత్మీయత, ఆర్ద్రత ధ్వనించ టంలో లక్ష్మీదేవి చకితురాలయింది.

"లక్ష్మీ! మనపెళ్ళి నీకు గుర్తుందా?" అన్నాడు గోపాలం!

"పోదురూ! మీరు మరీనూ!" అపురూపంగా సిగ్గు పడుతూ అన్నది లక్ష్మీదేవి.

(10)

"నీకు మరీ పదేళ్ళేగా! జ్ఞాపకం వుండివుండదు. కాని నాకు జ్ఞాపకం వుంది నాకప్పటికి ఇరవై ఎనిమిదేళ్ళు వచ్చాయి. నేనూ ఒక్క పిల్లవాడినయినా నాకు పెళ్ళి ఆలస్యం చేశారు. కారణం ఏమిటంటే మా అమ్మకి ఒక్క అన్నగారు వుండేవారు. ఆయనకు కూతురు పుట్టితే నాకు ఇచ్చి చేయాలని మా అమ్మ ఉబలాటం! చివరికి ఆయనకు అంతా కొడుకులే తప్ప కూతుళ్లు పుట్టలేదు. ఇంక అప్పుడు సంబంధాల కోసం వెతకటం మొదలుపెట్టారు. నాకు ఒక మేనత్త వుండేది. వాళ్ళకి ఒక అమ్మాయి వుండేది. చిట్టెమ్మ దానిపేరు! నువ్వు చూస్తే...వున్నావుగా!"

"ఆ నాకెందుకు తెలీదు? రంగం పిన్ని కోడలేగా" అంది ముసలాయన జీవిత కథ ఆసక్తిగా వింటూ.

"ఆవిడ నల్లగా వుండేది. అంతా నల్లచింతపండు అనే వాళ్ళం. ఎలాగయినా ఆ నల్లచింతపండుని నా కంటకట్టాలని మా మేనత్త పట్టుదల, నాన్నకి అక్కకూతుర్ని కోడల్ని చేసుకోవాలనే అభిలాష వుండేది. మా అమ్మకి ఆడపడుచు అంటే కిట్టేదికాదు! అంచేత చిట్టెమ్మని కాదని మా నాన్నతో హోరా హోరీ పోరాడి, పచ్చగా జామపండులా వున్న నిన్ను నాకు చేసింది" ఆగాడు.

"అయితే?" సందేహంగా చూసింది లక్ష్మీదేవి.

"విశ్వం పెళ్ళిముందు నా పెళ్ళి గుర్తుకివచ్చింది. నా పెళ్ళి నీతో అయిన మొదలు మా మేనత్తలువాళ్ళు మా ఇళ్ళకి రాకపోకలు ఆపుచేసారు.

"నిన్ను పెళ్ళిచేసుకోవటంనించి నాకున్న ఒకే ఒక మేనత్తనించి దూరమయ్యేను అన్నది నా మనస్సులో ఏ మూలో మెదుల్తూంది. ఈ పిల్లలూ, నువ్వూ నా సంపాదనంతా స్వేచ్ఛగా, నిరాఘాటంగా అనుభవిస్తోండటం నాలో ఏమూలో ఈర్ష్యనికలిగించింది. వయస్సులో భార్యాభర్తలు ఒకళ్ళపట్ల ఒకళ్ళు ప్రేమలు ఒలకపోసుకుంటూరంటే వాళ్ళకి శారీరకావసరమే ముఖ్య కారణమనుకుంటాను. వయస్సు ముదిరినకొద్దీ భార్యాభర్తలు ఏకత్వంనించి విడివడి నీవాళ్లు, నావాళ్ళు, అభిమానాలూ, అవమానాలూ అంటూ స్వార్థ పిశాచి కబంధహస్తాల్లో ఇరుక్కుపోయి భిన్నాభిప్రాయాలు వెలువరిస్తారు. నీ అందం నా కళ్ళు కప్పిన రోజుల్లో నువ్వంటే విపరీతమయిన మోహం ఏర్పడి నాకు వంటరితనం అన్పించలేదు. ఆ ఆకర్షణ కొంచెం కొంచెం సడలగానే నిన్ను నా కుటుంబంనించి వేరుచేసిన దానివిగా, నీవంటే అసహనం ప్రబలింది. నీవంటే నా మనస్సులో ఏర్పడ్డ అసూయ మూలంగా నిన్ను బంధించాలనే వుద్దేశ్యంతో నే విశ్వంకి నేను పై సంబంధం చేసాను. నేను నా మేనత్తకుటుంబంనించి విడిపోయేను. విశ్వంకి నీ అన్నకూతుర్ని చేస్తే మీరంతా ఒకేకుదుట్లో మొలిచిన అరటిపిలకల్లా వుంటారు. నా అన్న వాళ్ళు లేకుండా వంటరిగా మిగిలిపోతాను. ఈ నా సంపాదనకు ఐశ్వర్యానికి రెండోతరంలో కూడా నీవాళ్ళే హక్కుదారులవటం నేను భరించలేకపోయేను. ఎంచేతో అప్పటి నా మనఃస్థితి నాకే అవగతంకాదు. అప్పటి నీ బాధ, నీ దుఃఖం నాకెంతో వేళాకోళంగా కన్పించేవి ! అందుచేతనే

విశ్వానికి నీ మాట కాదని వాడిని బలవంతంచేసి కుసుమని పెళ్ళిచేసాను" అాగేడు గోపాలం !

లక్ష్మీదేవి విశాలంగా నవ్వింది.

"అదేం మంచిమాట ! మీా వంశానికి వరసగా రెండు తరాలవాళ్ళు భాగస్వాములు కావటం ఆనవాయితీ లేదు. అందుకనే నారాయణ ఇంకొకఅమ్మాయిని ప్రేమిం చటం జరిగింది. దీనికంత రాద్ధాంతం ఎందుకు మీా కోడలికి నచ్చచెప్పండి. మనయింటి ఆనవాయితీ ప్రకారమే జరుగు తూందికదా ?" పకపక నవ్వింది లక్ష్మీదేవి మళ్ళీ.

"నన్ను క్షమించు లక్ష్మీ ! నేను పొరపాటు ఒప్పె కున్నానుకదా ! ఏదన్నా అసందర్భం జరిగితేకాని తనుచేసిన పొరపాటు తనకి తెలిసిరాదు. విశ్వం, కుసుమల పెళ్లి వల్ల మనం ఎంతటి ఆత్మీయత పోగొట్టుకున్నామో నాకు బాగా తెలిసివచ్చింది. దిగితేకాని లోతు తెలియదుకదా! లోతుగా వున్న మురికిగుంటలో దిగి దాని దుర్వాసనకి ఉక్కిరిబిక్కిరి అయికూడా, మన పిల్లలు అదే మురికిగుంటలో దిగుతా మంటే వారించటం, మన పెద్దవాళ్ళ కర్తవ్యం కాదా ? నేనూ, మా అమ్మా అవివేకంవల్ల చేసిన పొరపాటు తర తరాలవరకూ పొడిగించుకోవల్సిందేనా ? నన్ను క్షమించు ! నారాయణకి ఇంకా మనం అంటే గౌరవం, అభిమానం, ప్రేమా, భయం, భక్తీ వున్నాయి. నువ్వు విశ్వంకూడా వాడికి నచ్చచెప్పితే వాడు తన ప్రేమకథని త్యాగం చేయ గలడు. నీలా, వాడూ భార్యాభర్తలయితే కుసుమ మనస్సు సంతోషిస్తుంది.

"కొడుకువల్ల సుఖసంతోషాలు పొందగల్గిన ఏ తల్లిని చూసినా ప్రతితల్లీ తృప్తిగా నిట్టూర్చుతుంది. తనమాతృత్వం సార్థకమయిందనుకుంటుంది. ఆ సంతోషం నీకు మటుకు ఎందుకుండదు" అన్నాడు చెల్లింపుగా.

సందె వెన్నెల పలచపలచగా చెట్లచాటునుంచి వరండామీదకి పరుచుకుంటోంది! ముసలాయన మంచం మీద జారబడుతూ.

"కష్టమో సుఖమో మనరోజులు వెళ్ళిపోయాయి." అన్నాడు.

"ఎంత చిత్రమయిన మగవాళ్ళండీ మీరు. అసలు ఈ మగజాతిని నమ్మమని ఎక్కడుంది. ఎన్నితరాలు గడిచినా మీరు నవ్వించితే నవ్వటం, ఏడ్పించితే ఏడ్వటంతప్ప ఆడ వాళ్ళకి స్వయం వ్యక్తిత్వం రావటంలేదు. కొడుకయినా, సోదరుడయినా, తండ్రిఅయినా, భర్తఅయినా స్త్రీని బాధించి తృప్తిచెందుతారుతప్ప ఆమె ఆలోచనలకు ప్రాధాన్యత నీయరు. ఇంత కుళ్ళు ఆలోచన్లతో, ఈర్ష్యాసూయలతో నా కన్నవాళ్ళకు నన్ను కాకుండా చేసేరు. మీ డబ్బూ, ఐశ్వర్యం, మిథ్యాగౌరవాలు ఎవళ్ళకి కావాలి? ఒక కుటుంబంలో మసిలేందుకు పరస్పర అవగాహన కావాలి? సుహృద్భావం వుండాలి!" అంది. విశ్వం వరండామీదకి వచ్చాడు. అతని వెనకాతలే కుసుమకూడా తండ్రి ప్రక్కగా వచ్చి,

"నారాయణ ఈ వారంలో సెలవుపెట్టి వస్తున్నాడుట. వాళ్ళ స్నేహితుడు రామంవచ్చి చెప్పాడు నాన్నగారూ?" అన్నాడు.

"సరే! రాగానే నువ్వా మీ అమ్మ వాడికి మేనరికం చేసుకొమ్మని నచ్చచెప్పండి! మీరిద్దరూ కూడా చెప్పితే వింటాడు" అన్నాడు గోపాలం!

"నా ఇష్టమేమీ లేదు, వాడిష్టం, వాడి నాయనమ్మ ఇష్టం" అన్నాడు విశ్వం. "కొడుకు పెళ్ళికి లేని పెత్తనం మనుమడి పెళ్ళికెందుకు నాయనా! మీరే చేసుకోండి! ఏం చేసుకుంటారో? నాకేం కావాలి?" అన్నది లక్ష్మీదేవి నిష్ఠూరంగా.

"అలా గాలికి వదిలేస్తే ఎలాగండీ? మీరంటే అభిమానం వున్నది వాడికి. మీరు చెప్తే వింటాడు వాడు" అన్నది కోడలు కుసుమ.

"సరిసర్లే! నువ్వా నామీదే పెట్టావూ ఆ భారం! నేను చెప్పటానికేముంది. చెప్పిచూస్తాను. వీళ్ళ తాతగారి కధ "చర్విత చరణం" కాకుండా చేయగలిగితే నాకూ సంతోషమే! ఎంతయినా ఆడదాన్ని! రక్తసంబంధం మీద ఆడదాని మమత ఎలావుంటుందో తెలీనిదాన్ని కాదు! నీ బాధ నేను అర్థంచేసుకున్నట్టు, నా బాధ ఎవరూ అర్థంచేసుకోలేక పోయారు. నేను తప్పక నీ మేనకోడలునే చేసుకొమ్మని చెప్పుతాను. సరేనా ఆ పయిన భగవంతుడి దయ! విధి వ్రాత" నిర్వేదంగా అన్నది లక్ష్మీదేవి! కుసుమ ముఖం చింతపిక్కల్లే చేసుకుని వెళ్ళిపోయింది. భర్తవైపు చూసి గర్వంగా నవ్వింది లక్ష్మీదేవి!